# అక్రమ పశువుల రవాణాపై ఉక్కుపాదం!

- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవు
- జిల్లావ్యాప్తంగా 22 చెక్‌పోస్టులతో ముమ్మర నిఘా
- డీసీపీ ఏ. భాస్కర్



**వేల్పుల నగేష్, జనం పవర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల జోన్ పరిధిలోని గోరక్షక్ సభ్యులతో పశువుల అక్రమ రవాణా నిరోధంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. మంచిర్యాల పట్టణ కేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో డీసీపీ ఏ. భాస్కర్ చట్టపరమైన నిబంధనలను వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాల ప్రకారం ఆవులు, దూడలను వధించడం నిషేధించబడిందని పేర్కొన్నారు. గజీవాలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించే సమయంలో వాటికి ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని చెప్పారు.

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ యాక్ట్, కౌస్లాటర్ యాక్ట్, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్టాల కింద కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని డీసీపీ హెచ్చరించారు. గోరక్షక్ పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులు చేయడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

## చెక్‌పోస్టులతో ముమ్మర తనిఖీలు

పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా 7 శాశ్వత చెక్‌పోస్టులు, 15 ఆకస్మిక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు డీసీపీ తెలిపారు. రవాణా చేసే పశువులకు వెటర్నరీ డాక్టర్ ఆమోదించిన ధ్రువపత్రం తప్పనిసరిగా ఉండాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతి... వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, వివరాలను ప్రత్యేక గ్రూపుల్లో అప్‌లోడ్ చేస్తున్నామని చెప్పారు. అక్రమ రవాణా సమాచారం తెలిస్తే రామగుండం పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712656597 లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, ఇన్‌స్పెక్టర్లు ప్రమోద్‌రావు, రవీందర్, రమణమూర్తి, అశోక్ కుమార్, హనుక్, జోన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం!

**ఆరు గ్యారంటీలను గాలికొదిలేసిన ప్రభుత్వం**

**ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గం: బీఆర్ఎస్ నాయకులు**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎడ్ల సోమిరెడ్డిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య హక్కులపై దాడిగా అభివర్ణించారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించే వారిని భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్న కాంగ్రెస్ నాయకుల వైఖరిని ఖండిస్తున్నామని తెలిపారు. ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తామని, బెదిరింపులకు భయపడబోమని స్పష్టం చేశారు. అలాగే రాజకీయ విమర్శలు హద్దులు దాటకుండా ఉండాలని, వ్యక్తిగత దూషణలు చేయవద్దని సూచించారు.

# పుస్తక పఠనం జ్ఞాన వికాసానికి పునాది!



- యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి
- డిజిటల్ యుగంలోనూ తగ్గని పఠన ప్రాధాన్యత
- డీఈవో వెంకటేశ్వర్లు

**సంగారెడ్డి, మే 15 (జనం పవర్):** విద్యా వారోత్సవాల సందర్భంగా సంగారెడ్డి జిల్లా గ్రంథాలయంలో శుక్రవారం ఘనంగా "లైబ్రరీ డే" పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పుస్తకాల ప్రదర్శనను ఆయన పరిశీలించి అభినందించారు. విద్యార్థులు, యువత, పాఠకులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పుస్తకాలు మనిషికి మంచి మిత్రులని, గ్రంథాలయాలు జ్ఞానానికి నిలయాలుగా నిలుస్తాయని అన్నారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా సాహిత్యం, చరిత్ర, విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాలను కూడా చదవాలని సూచించారు. డిజిటల్ యుగంలోనూ పుస్తక పఠనానికి ఉన్న ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ.. యువతలో చదువుపై ఆసక్తి పెంచేందుకు గ్రంథాలయ శాఖ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నదన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి వసుంధర, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

# అధికారుల తీరు మారకపోతే కఠిన చర్యలు!

**ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి: మున్సిపల్ చైర్‌పర్సన్ అంజమ్మ**



**సదాశివపేట, మే 15 (జనం పవర్):** అధికారుల తీరు మారకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అంజమ్మ హెచ్చరించారు. సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో అధికారుల పనితీరుపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి వార్డుల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. గత సమావేశాల్లో కూడా పలు అంశాలపై హెచ్చరించినప్పటికీ అధికారుల తీరు మారలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న పనులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇకపై విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# చెట్టు నరికినందుకు రూ.25 వేల జరిమానా!

**అనుమతి లేకుండా చెట్టును తొలగించిన కాలేజీ యాజమాన్యం**

**ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చేందుకు కఠిన చర్యలు**

**మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్**




**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల గురుకృప మోషన్ ఎలైట్ కళాశాల భవనం ముందున్న చెట్టును మున్సిపల్ అనుమతులు లేకుండా తొలగించినందుకు కళాశాల యాజమాన్యానికి రూ.25 వేల జరిమానా విధించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. కమిషనర్ అశ్రిత్ కుమార్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు మున్సిపల్ సిబ్బంది నిరంతరం కృషి చేస్తుంటే, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా చెట్లను తొలగించడం బాధాకరమని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు

పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా చెట్లను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. మున్సిపల్ అనుమతులు లేకుండా ఎవరైనా చెట్లను తొలగిస్తే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఇదే సందర్భంగా పట్టణంలో ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. వేడి ఆహారాన్ని ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళ్లడం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పట్టణంలో పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ కవర్లు విక్రయించే వారిపై మున్సిపల్ సిబ్బంది జరిమానాలు విధిస్తున్నట్లు చెప్పారు. ఫంక్షన్ హాళ్లలో జరిగే శుభకార్యాలలో ప్లాస్టిక్ కు బదులుగా అన్ని వార్డుల్లో అందుబాటులో ఉన్న స్టీల్ బ్యాంకులను వినియోగించుకోవాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడితేనే భావితరాలకు భరోసా కల్పించిన వారమవుతామని అధికారులు స్పష్టం చేశారు.

# వడ్ల కొనుగోలు కేంద్రంలో అవకతవకలు!

**సామాన్య రైతులకు తీవ్ర అన్యాయం**

**పైరవీకారులకే ప్రాధాన్యం ఇస్తున్నారు**

**సీపీఐ మండల సహాయ కార్యదర్శి సంగెం మధు**

**బెజ్జంకి, మే 15 (జనం పవర్):** వడ్ల కొనుగోలు కేంద్రంలో అవకతవకలు జరుగుతున్నాయని, దీనివల్ల సామాన్య రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సీపీఐ మండల సహాయ కార్యదర్శి సంగెం మధు ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో పైరవీకారులకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. బెజ్జంకి మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలుదారులు, ప్రజాప్రతినిధుల తీరు వల్ల రైతులు చిన్నాభిన్నం అవుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం బెజ్జంకిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాప్రతినిధులు పైరవీలు చేస్తూ సామాన్య రైతులను నష్టపరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## సీరియల్ నంబర్ల ఉల్లంఘన

ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ఒక రైతుకు సీరియల్ నంబర్ ఇచ్చి, ఆ నంబర్ పై వేరే రైతు వడ్లను అమ్మడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించి వడ్లు అమ్మిన రైతుపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం కొనుగోలు నిర్వాహకులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. సామాన్య రైతులు వడ్లు పోసి చాలా రోజులు గడుస్తున్నప్పటికీ వారి పంటను కొనకపోవడం చాలా బాధాకరమన్నారు. వెనుక కోసిన రైతుల పంట ముందుగా కొనుగోలు చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఆందోళన చేపడతాం

ఐకేపీ కొనుగోలు నిర్వాహకులు రాసిచ్చిన జాబితాను బహిర్గతం చేసి పేద రైతులను ఆదుకోవాలని సంగెం మధు డిమాండ్ చేశారు. కొనుగోలు నిర్వాహకులు తమ వైఖరి మార్చుకోకపోతే రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. లేనిపక్షంలో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని స్పష్టం చేశారు.

# ఇస్రో శాస్త్రవేత్తగా బెజ్జంకి యువకుడు!

**ఒజ్జపల్లి శ్రీమాన్ అరుదైన ఘనత..గ్రామస్తుల హర్షాతిరేకాలు**




**బెజ్జంకి, మే 15 (జనం పవర్):** ఇస్రో శాస్త్రవేత్తగా బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన ఒజ్జపల్లి శ్రీమాన్ నియామకం పొందడం పట్ల గ్రామస్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థలో ఆయనకు శాస్త్రవేత్తగా అవకాశం దక్కడం ఈ ప్రాంతానికే ఎంతో గర్వకారణంగా మారింది. శ్రీమాన్ తండ్రి ఒజ్జపల్లి నాగయ్య స్థానిక జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్ననాటి నుంచే చదువులో విశేష ప్రతిభ కనబరిచిన శ్రీమాన్ ప్రతిష్టాత్మక సంస్థలో అవకాశం దక్కించుకోవడంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు శ్రీమాన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.



# ఘనంగా రసమయి బాలకిషన్ జన్మదిన వేడుకలు!

బెజ్జంకి అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కటింగ్

బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యం



**బెజ్జంకి, మే 15 (జనం పవర్):** తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ జన్మదిన వేడుకలు బెజ్జంకి మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద భారత రాష్ట్ర సమితి మండల అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు, అభిమానులు కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టి ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రసమయి బాలకిషన్ చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రసమయి బాలకిషన్ నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తారని నాయకులు కొనియాడారు. తొలిపొద్దు కార్యక్రమం ద్వారా ప్రజల్లో నిత్యం ఉండేవారని, తన రాజకీయ ప్రస్థానంలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన ఎల్లప్పుడూ కృషి చేశారని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రసమయి బాలకిషన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటూ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని, రసమయిపై లక్ష్మీ నరసింహ స్వామి కృప ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# సీసీ కెమెరాలతో నేరాలకు చెక్!

వడ్లూరు, తోటపల్లిలో నిఘా నేత్రాలు

కెమెరాలను ప్రారంభించిన ఎస్సై తోట తిరుపతి

ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానం




**బెజ్జంకి, మే 15 (జనం పవర్):** గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుతో నిందితులను త్వరితగతిన గుర్తించడం సులభతరం అవుతుందని బెజ్జంకి ఎస్సై తోట తిరుపతి స్పష్టం చేశారు. సిద్దిపేట కమిషనర్ రష్మీ పేరుమాల్ ఆధ్వర్యంలో చేపట్టిన "సురక్షా నేత్ర" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వడ్లూర్, తోటపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. కనెక్టెడ్ విలేజెస్... ప్రొటెక్టెడ్ కమ్యూనిటీస్ లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపతి మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఒక్క కెమెరా 100 మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు ఉండటం వల్ల నేరాలను త్వరితగతిన గుర్తించడం, నిందితులను సులభంగా పట్టుకోవడం సాధ్యమవుతుందన్నారు. నేరాల నివారణలో ఇవి ఎంతో సహాయపడతాయని, గ్రామ ప్రజలు కెమెరాల సంరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ జోలికి వెళ్లవద్దని ఎస్సై సూచించారు. మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తాయని హెచ్చరించారు. కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామ పెద్దలు, దాతలు, గ్రామ ప్రజలు, వడ్లూర్, తోటపల్లి గ్రామ సర్పంచులకు ఎస్సై తిరుపతి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పోలీసుల ముందడుగును గ్రామ ప్రజలు అభినందిస్తూ, గ్రామాలను సురక్షితంగా మార్చేందుకు పూర్తి సహకారం అందిస్తామని ప్రకటించారు.

# కవ్వాల్ అడవులను టచ్ చేస్తే జైలుకే!

అటవీ భూమి ఆక్రమణదారుడికి 15 రోజుల రిమాండ్

నిందితుడిని జైలుకు తరలించిన అధికారులు

అడవులను నాశనం చేస్తే ఉపేక్షించం: రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ




**జన్నారం, మే 15 (జనం పవర్):** కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలోని అటవీ సంపదను నాశనం చేసినా, అంగుళం భూమిని ఆక్రమించినా చట్టం ముందు నిలబడక తప్పదని జన్నారం రేంజ్ అధికారి కే లక్ష్మీనారాయణ హెచ్చరించారు. గడ్డం గూడ ప్రాంతంలో అటవీ భూమి ఆక్రమణకు పాల్పడిన ఒక నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. జన్నారం సెక్షన్ పరిధిలోని గడ్డం గూడ అటవీ ప్రాంతంలో భూక్యా బలిరాం అనే వ్యక్తి అటవీ భూమిని ఆక్రమించినట్లు విచారణలో తేలిందన్నారు. దీనిపై కోర్టు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని మంచిర్యాల కోర్టులో హాజరుపరిచామని తెలిపారు. కేసు తీవ్రతను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి 15 రోజుల రిమాండ్ విధించడంతో ఆదిలాబాద్ జిల్లా కారాగారానికి తరలించినట్లు పేర్కొన్నారు. చెట్లను నరికేసి భూములు ఆక్రమించాలనుకునే వారిపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

# 2027 నాటికి కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యం!

- సమిష్టి కృషితోనే లక్ష్య సాధన సాధ్యం
- రాష్ట్ర లెప్రసీ పరిశీలకులు డాక్టర్ రాజు



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర లెప్రసీ పరిశీలకులు డాక్టర్ రాజు ఎస్ఎంఓ నేతృత్వంలో జిల్లాలోని చిన్నగూడూరు, కొమురవెల్లి, నాసర్‌పుర అర్బన్ హెల్త్ సెంటర్లలో లెప్రసీ కార్యక్రమాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రాల్లో రికార్డులను తనిఖీ చేసి, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. లెప్రసీ నిర్మూలన కార్యక్రమంలో తీసుకోవాల్సిన ముందస్తు ప్రణాళికలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలు, ప్రజల్లో అవగాహన పెంపు వంటి అంశాలపై ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఐడీఓసీ డీఎంహెచ్ఓ మీటింగ్ హాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ అధ్యక్షతన మెడికల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ 2027 నాటికి కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఆరోగ్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

డీఎంహెచ్ఓ డాక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ లెప్రసీ వ్యాధి అనేది శాపం కాదని, ఇది సాధారణ చర్మవ్యాధిలా పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని తెలిపారు. ముందస్తుగా లక్షణాలను గుర్తించి సరైన చికిత్స అందిస్తే వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల్లో అవగాహన పెంచి సిద్దిపేట జిల్లాను లెప్రసీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని సూచించారు.

## డెంగ్యూ కరపత్రాల ఆవిష్కరణ

ప్రతి సంవత్సరం మే 16న నిర్వహించే జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కరపత్రాలను డాక్టర్ ధనరాజ్, డాక్టర్ రాజు, ప్రోగ్రాం అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాల్లో కుష్టు వ్యాధి నిర్మూలనతో పాటు డెంగ్యూ నివారణపై కూడా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లెప్రసీ పరిశీలకుల బృంద సభ్యులు సకల రెడ్డి, వెంకటేశ్వర చారి, సురేందర్, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నిర్మలారెడ్డి, డాక్టర్ వినోద్, డాక్టర్ దీప్తి ప్రియాంక, డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, డీపీఎంఓ లక్ష్మణ్, జయాకర్, జయమ్మ, రవీందర్, డీఈఎంఓ నవీన్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి!

- ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నిర్మూలన సాధ్యం
- వైద్యారోగ్య, మున్సిపల్ శాఖల సమన్వయం అవసరం
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

డెంగ్యూ నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నిర్మూలన సాధ్యమవుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. వైద్యారోగ్య, మున్సిపల్ శాఖల సమన్వయం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మే 16న జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని, జిల్లాలో డెంగ్యూ, ఇతర కీటక జనిత వ్యాధుల నివారణకై శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డెంగ్యూ నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్లను, కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. ఎండాకాలం ముగిసి వర్షాకాలం ప్రారంభమయ్యే ఈ వాతావరణ మార్పుల సమయంలో దోమల ద్వారా వచ్చే వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, కావున అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దోమలు ప్రజా ఆరోగ్యానికి ప్రధాన శత్రువులని, వీటి ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, జికా వంటి ప్రమాదకరమైన వ్యాధులు వ్యాపిస్తాయని హెచ్చరించారు. మన ఇళ్లు, పరిసరాలలో సాధారణంగా అనాఫిలిస్, క్యూలెక్స్, ఈడిస్ దోమలు పెరుగుతాయని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. ప్రజలందరినీ ఈ నివారణా చర్యల్లో భాగస్వామ్యం చేయాలని, ముఖ్యంగా వృద్ధులు, గర్భవతులు, చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## డెంగ్యూ జ్వరం ప్రధాన లక్షణాలు

డెంగ్యూ వ్యాధి డెంగ్యూ వైరస్ వల్ల వస్తుందని కలెక్టర్ తెలిపారు. అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం రావడం, ఎముకలు, కండరాలు, కీళ్లలో విపరీతమైన నొప్పులు ఉండటం దీని ప్రధాన లక్షణాలన్నారు. కళ్ల వెనుక భాగంలో నొప్పి, శరీరంపై చిన్నపాటి దద్దుర్లు రావడం, జ్వరం తగ్గినట్లుగా అనిపించి, వారం లేదా పది రోజుల్లో మళ్లీ తిరగబెట్టడం వంటి లక్షణాలు ఉంటాయని వివరించారు.

జిల్లాలో ఉచిత పరీక్షల సౌకర్యం

డెంగ్యూ వ్యాధిపై ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని కలెక్టర్ భరోసా ఇచ్చారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వ్యాధి నిర్ధారణ కోసం రాపిడ్ డయాగ్నొస్టిక్ కిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, తెలంగాణ డయాగ్నొస్టిక్స్ ల్యాబ్‌లలో అధునాతన ఎలిసా టెస్ట్ సౌకర్యం కూడా ఉచితంగా అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

## దోమల నియంత్రణకు పాటించాల్సిన జాగ్రత్తలు

జిల్లా వ్యాప్తంగా దోమల ఉత్పత్తిని అరికట్టడానికి ప్రజలు, అధికారులు పలు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. వారానికి ఒకసారి ఇంట్లోని నీటి నిల్వ పాత్రలను ఖాళీ చేసి, ఎండబెట్టి మళ్లీ వాడుకునేలా ఫ్రైడే - డ్రై డే పాటించాలన్నారు. ఇళ్లలో లేదా ఆవరణలో ఉన్న నీళ్ల కుండీలు, బావులు, ఓవర్ హెడ్ ట్యాంకులపై దోమలు గుడ్లు పెట్టకుండా గట్టిగా మూతలు పెట్టాలన్నారు. ఇంటి చుట్టుపక్కల నీటి గుంటలు లేకుండా చూసుకోవాలని, మురికి కాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించి, మురుగునీరు సజావుగా పారేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. వాడకంలో లేని సీసాలు, డబ్బాలు, పాత రబ్బరు టైర్లు, వాటర్ కూలర్లు, నర్సరీ పాత్రలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.

## కట్టుదిట్టమైన పారిశుధ్య కార్యక్రమాలు

గ్రామపంచాయతీ సర్పంచులు, మున్సిపల్ కమిషనర్లు, వార్డు మెంబర్ల సహకారంతో గ్రామాల్లో, పట్టణాల్లో విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్, గ్రామపంచాయతీ శాఖలు పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో ఎక్కడా వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ రవికిరణ్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# పొట్యాల దాహార్తిని తీర్చిన ఎమ్మెల్యే గడ్డం వినోద్

- తక్షణమే బోర్ వెల్ వేయించి నీటి కష్టాలు తీర్చిన వైనం
- సమస్య విన్నవించిన వెంటనే స్పందించిన శాసనసభ్యుడు
- ఎమ్మెల్యే చొరవపై హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



**బెల్లంపల్లి, మే 15 (జనం పవర్):** ఎండలు మండుతున్న వేళ, చుక్క నీటి కోసం అల్లాడుతున్న పొట్యాల గ్రామస్తుల కష్టాలకు తెరపడింది. బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి తక్షణ చొరవతో చిన్నవేంకటాపూర్ పంచాయతీ పరిధిలోని పొట్యాల గ్రామంలో కొత్త బోర్ వెల్ ఏర్పాటు చేశారు. ప్రజా సమస్యలపై ఆయన చూపుతున్న వేగం చూసి స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సమస్య విన్నవించిన వెంటనే పరిష్కారం

వేసవి ప్రారంభంలోనే పొట్యాలలో తాగునీటి ఎద్దడి తీవ్రమైంది. ఈ గడ్డు పరిస్థితిని గ్రామ సర్పంచ్ జలంపెల్లి భాస్కర్, జిల్లా డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బొమ్మేన హరీష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. హరీష్ గౌడ్ వెంటనే ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామితో మాట్లాడి, గ్రామస్తుల ఇబ్బందులను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే, కాలయాపన చేయకుండా తక్షణమే బోర్ వేయించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో రంగంలోకి దిగిన యంత్రాంగం, గ్రామంలో బోర్ వేయించే ప్రక్రియను వేగంగా పూర్తి చేసింది. భూగర్భ జలాలు పడటంతో గ్రామస్తుల ముఖాల్లో చిరునవ్వులు విరిశాయి. తమ విన్నపాన్ని మన్నించి, తక్షణమే స్పందించిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున కృతజ్ఞతలు తెలిపారు. ఈ బోర్ వెల్ ఏర్పాటు కార్యక్రమంలో సర్పంచ్ జలంపెల్లి భాస్కర్, వార్డ్ సభ్యులు యాదనవేణి తిరుమలేష్, చెన్నూరి తిరుపతి, అంబటి రాజ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు దుర్గం లింగస్వామి, అర్కుటి రాజన్న, అర్క నారాయణ, మాసు సురేష్ పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి, ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి తాము ఎప్పుడూ ముందుంటామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.



# సంగారెడ్డి అంతర్జాతీయ ఇండస్ట్రియల్ కారిడార్!

## పెట్టుబడులు పెరిగితేనే ఉద్యోగ అవకాశాల విస్తరణ

## వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**సంగారెడ్డి, మే 15 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లాను అంతర్జాతీయ పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. అలియాబాద్‌లో ఏర్పాటు చేసిన కేజేఎస్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమ 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' విధానంలో పర్యావరణహితంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. పెట్టుబడులు పెరిగితేనే ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని, కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగానే పరిశ్రమలు వస్తున్నాయని చెప్పారు. పరిశ్రమ స్థాపనకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

### రెండు లక్షల ఉద్యోగాల సృష్టి

రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి మంచి విజన్‌తో ముందుకు సాగుతున్నారని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా ఇండస్ట్రియల్ హబ్‌గా మరింత అభివృద్ధి చెందుతుందని, వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని తెలిపారు. నిమ్స్ ప్రాజెక్టు ద్వారా 12 వేల ఎకరాల్లో రెండు లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు సృష్టించనున్నట్లు వెల్లడించారు.

### అన్ని నియోజకవర్గాల్లో పరిశ్రమలు

ఉమ్మడి మెదక్ జిల్లాలోని మిగిలిన ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఎంపీ ఎం. రఘునందన్ రావు మంత్రి శ్రీధర్ బాబును కోరారు. తొగర్‌పల్లిలో రూ.650 కోట్లతో నిర్మిస్తున్న కేజేఎస్ ఫుడ్ ఇండస్ట్రీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పటాన్‌చెరు, జహీరాబాద్ ప్రాంతాల్లో కాలుష్యం పెరుగుతోందని, ఇతర ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### కొత్త పరిశ్రమలకు పూర్తి ప్రోత్సాహం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త పరిశ్రమల స్థాపనకు పూర్తి స్థాయిలో ప్రోత్సాహం అందిస్తున్నాయని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజి రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో పరిశ్రమలు పెరగడం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించి జిల్లా అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని అన్నారు. నూతన పరిశ్రమల ఏర్పాటుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.



### మహిళల ఆర్థిక స్వావలంబన

సంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో రాహుల్ గాంధీ కుటుంబం పాత్ర మరవలేనిదని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. అలియాబాద్‌లో జరిగిన కేజేఎస్ యూనిట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన, ఈ పరిశ్రమ ద్వారా 1,500 మంది మహిళలకు ఉపాధి లభించడం ఆనందదాయకమని చెప్పారు. జిల్లాలో మరిన్ని పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

### సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి

నారాయణఖేడ్ నియోజకవర్గంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పరిశ్రమల శాఖ మంత్రిని కోరారు. రూరల్ ఇండస్ట్రియల్ పాలసీ ద్వారా వెనుకబడిన సరిహద్దు ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించి స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఆ ప్రాంతానికి ఆర్టికల్ 371 (డి) వర్తింపజేసి మరింత అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

# ధరల పెంపు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే

ఎన్నికల తర్వాత భారం మోపడం బీజేపీ నైజం

## నీట్ లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు





**సంగారెడ్డి, మే 15 (జనం పవర్):** ధరల పెంపు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని, ఎన్నికల తర్వాత భారం మోపడం బీజేపీ నైజమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విమర్శించారు. నీట్ లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని ఆరోపించారు. మంత్రి శ్రీధర్ బాబు సంగారెడ్డిలో నిర్మలా జగ్గారెడ్డి నివాసంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్ పాల్గొన్నారు.

### పేదలపై అదనపు భారం

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలను మూడు రూపాయలు పెంచడం ప్రజలపై భారంగా మారిందని విమర్శించారు. నాలుగు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం ధరల పెంపు చేపట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లేనని అన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. బెంగాల్, తమిళనాడులో ఎన్నికల చివరి దశకు ముందు పెట్రోల్, డీజిల్ ధరలు పెరగవని అధికార వర్గాలు చెప్పి, ఇప్పుడు పెంపు చేయడం ద్వారా ఓటర్లను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గిన సమయంలో కేంద్రం ప్రజలకు ఎప్పుడైనా ఉపశమనం కల్పించిందా అని బీజేపీని ప్రశ్నించారు.

### బీజేపీ అసలు స్వరూపం ఇదే

ఇప్పుడు మూడు రూపాయలు పెంచి, ఇంకా ధరలు పెరిగే సంకేతాలు ఇస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరలపై అదనపు భారం మోపి పేదల, సామాన్య ప్రజల నడ్డి విరచడమే బీజేపీ అసలు స్వరూపమని వ్యాఖ్యానించారు. గత పన్నెండేళ్లలో అంతర్జాతీయంగా చమురు ధరలు అత్యల్ప స్థాయికి చేరినా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ప్రయోజనం కల్పించలేదని విమర్శించారు. రాజకీయ అంశాలపై స్పందిస్తూ, ప్రజలను విభజించడం, ప్రజల మధ్య చిచ్చు పెట్టడం బీజేపీ లక్ష్యమని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలు స్నేహపూర్వకంగా జీవించాలని రాహుల్ గాంధీ కోరుతున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజలు విజ్ఞానవంతులని, బీజేపీ కుట్రపూరిత రాజకీయాలను అంగీకరించరని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమానికే కట్టుబడి ఉందని స్పష్టం చేసిన మంత్రి, రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రులందరూ సమిష్టిగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సక్రమంగా వినియోగిస్తామని చెప్పారు. ధాన్యం కొనుగోలు అంశంపై మాట్లాడుతూ, దేశ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి భారీగా ధాన్యం మార్కెట్‌కు వచ్చిందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతి రెండు రోజులకు ఒకసారి ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహిస్తున్నారని, చివరి గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు హామీ ఇచ్చారు.

### నీట్ లీకేజీపై కేంద్రం క్షమాపణ చెప్పాలి

నీట్ పరీక్ష లీకేజీ ఘటనపై కూడా మంత్రి స్పందించారు. దాదాపు ఇరవై మూడు లక్షల విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రంలోని ఎన్డీఏ, బీజేపీ ప్రభుత్వం ఆడుకుందని ఆరోపించారు. ఎన్నో సంవత్సరాలు కష్టపడి చదివిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే, చట్టాలను చుట్టాలుగా బీఆర్ఎస్ ఉపయోగించినట్లు మేము చేయము, చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు.

# సంగారెడ్డి పారిశ్రామికాభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం!

### కేజేఎస్ పరిశ్రమతో 1,600 మందికి ఉపాధి

### మహిళల ఆర్థిక ప్రగతికి పెద్దపీట: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి, మే 15 (జనం పవర్):** సంగారెడ్డి పారిశ్రామికాభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యమని, కొత్తగా వస్తున్న కేజేఎస్ పరిశ్రమతో 1,600 మందికి ఉపాధి లభిస్తుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. మహిళల ఆర్థిక ప్రగతికి ఈ పరిశ్రమ ఎంతో పెద్దపీట వేస్తుందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. సంగారెడ్డి నియోజకవర్గం కొండాపూర్ తొగర్ పల్లి గ్రామంలో కేజేఎస్ పరిశ్రమ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ, ఎంపీలు సురేష్ షెట్కార్, మాధవనేని రఘునందన్ రావు, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, కేజేఎస్ సంస్థ ఎండీ గిరీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, సంగారెడ్డిలో వేల మంది మహిళలకు ఉపాధి కల్పించే పరిశ్రమ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సంగారెడ్డి ప్రజలు నన్ను ఓడించినందుకే నా భార్య నిర్మలకు టీజీఐఐసీ చైర్పర్సన్ పదవి వచ్చిందని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ ఈ నిర్ణయం తీసుకుని ఆమెకు పదవి ఇచ్చారని చెప్పారు. సంగారెడ్డి ప్రాంతంలో పరిశ్రమల స్థాపన జరగాలని, ఎక్కువ మందికి ఉపాధి దొరకాలనే లక్ష్యంతో తాము ఏడాది కాలంగా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తూ వస్తున్నట్లు తెలిపారు.

### మహిళలకు విశేష అవకాశాలు

ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని జగ్గారెడ్డి వివరించారు. ఈ క్రమంలోనే కేజేఎస్ సంస్థ ఎండీ గిరీష్ ఇక్కడ పరిశ్రమ స్థాపించడానికి ముందుకు వచ్చారన్నారు. ఈ పరిశ్రమ ద్వారా 1,600 మందికి ప్రత్యక్షంగా ఉపాధి దొరుకుతుందని, అందులో వెయ్యి మంది మహిళలకే అవకాశం ఉంటుందని ఎండీ తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ పరిశ్రమ వల్ల ప్రధానంగా తొగర్ పల్లి, అలియాబాద్, కొండాపూర్ ప్రాంతాల వారితో పాటు సంగారెడ్డి చుట్టుపక్కల ఉన్న వారికి కూడా ఉపాధి లభిస్తుందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు కూడా తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని జగ్గారెడ్డి కొనియాడారు. పనులు వేగంగా జరిగేలా వారు అధికారులకు తగిన సూచనలు చేశారని, అందుకే పరిశ్రమల స్థాపన వేగంగా జరుగుతోందని తెలిపారు. సంగారెడ్డికి పారిశ్రామికంగా చాలా పెద్ద చరిత్ర ఉందని గుర్తు చేశారు. నాడు ఇందిరా గాంధీ మెదక్ ఎంపీగా, దేశ ప్రధానిగా ఉంటూ ఈ ప్రాంతంలో బీడీఎల్, ఓడీఎఫ్ లాంటి ఎన్నో ప్రభుత్వ రంగ పరిశ్రమలను స్థాపించారని వివరించారు. ఆ తర్వాత కాలంలో బాగారెడ్డి, పి. రామచంద్రారెడ్డి, అలాగే మంత్రి దామోదర్ రాజనర్సింహ తండ్రి కూడా ఈ ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు ఎంతో కృషి చేశారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం సేవలు అందిస్తోందని చెప్పారు. తొగర్ పల్లిలో ఇంత మందికి ఉపాధి కల్పించేలా పరిశ్రమ త్వరలోనే అందుబాటులోకి రానుండటం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. సంగారెడ్డి జిల్లాలోని ఇంకా చాలా చోట్ల కొత్త పరిశ్రమలను నెలకొల్పి, స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా తమ కృషి నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



